## క్లుప్తంగా

### క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లికి చెందిన ఓ చిన్నారి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. జనసేన నాయకులు శనివారం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతి రావు, నియోజకవర్గ నాయకుడు జొన్న రాజేష్ మాట్లాడుతూ..బ్రెయిన్ క్యాన్సర్‌తో చిన్నారి కార్తీక బాధపడుతోందన్నారు. ఆమె తల్లిదండ్రులు గుణాల నాగదీపిక, ప్రశాంతికి రూ.10 వేల అందజేసినట్లు చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి పాప పరిస్థితిని తీసుకెళ్లి.. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చామని తెలిపారు. కాశిమాల దినేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, మేకా నాని, బత్తుల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత అవసరం



**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు పరిశీలించి, శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉన్న గాబులను నాలుగు రోజుల కోమారు శుభ్రం చేసుకోవాలన్నారు. తాగునీటి బిందెలు, ఫ్రిడ్జ్‌ల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు.

### గుర్తు తెలియని వృద్ధురాలికి గాయాలు

**చేబ్రోలు:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఆమె తల పైభాగం, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు బైక్‌లు ఢీ : ఐదుగురికి గాయాలు

**చేబ్రోలు:** బైకులు ఢీకొని ఐదుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో శనివారం జరిగింది. గుంటూరుకు చెందిన భార్యాభర్తలు భరత్ కుమార్, జగదీశ్వరమ్మలు ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై తెనాలి వైపు వెళుతున్నారు. ఈ సమయంలో మండల పరిధిలోని శేకూరుకు చెందిన సాయి రమేష్ బైక్‌పై అజాగ్రత్తగా వెళుతూ ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో గాయపడిన ఐదుగురిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆప్కాస్ రద్దు ఆలోచనతో ఉద్యోగులకు తీవ్ర నష్టం

**లక్ష్మీపురం:** కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, జీతాల చెల్లింపు ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ బి. లక్ష్మణరావు, సెక్రటరీ జనరల్ బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరో తేదీన జరిగిన మంత్రివర్గంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ పాత పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని నిర్ణయం చేసినట్లు కొన్ని పత్రికల్లో వచ్చాయని తెలిపారు. ఇది సరైనది కాదని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న 2,50,000 కాంట్రాక్ట్ ,అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణ

**నగరంపాలెం:** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలోని పద్మావతి కళ్యాణ వేదికపై భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు, దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమంజరిగింది. డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి సత్సంగ బృందం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్నను సత్కరించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఈపీఎఫ్ తలనొప్పి

- డాక్యుమెంట్లు ఇచ్చినా మళ్లీ ఇవ్వాలంటూ పదే పదే మెసేజ్‌లు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు



రెండు రోజుల క్రితం నగరపాలక సంస్థలో పత్రాలు ఇచ్చేందుకు క్యూ కట్టిన పారిశుద్ధ్య కార్మికులు

**నెహ్రూనగర్:** గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఈపీఎఫ్ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్) కష్టాలు తలనొప్పి తెప్పిస్తున్నాయి. ఆధార్, పాన్, ఓటర్, రేషన్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్, ఇతర పత్రాలు సమర్పించినప్పటికీ తిరిగి సమర్పించాలంటూ మేసేజ్‌లు రావడంతో ఆందోళన చెందుతున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల దాకా విధులు నిర్వహించి, తిరిగి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పత్రాలను ఇచ్చేందుకు అవస్థలు పడుతున్నారు.

### 647 మందికి మేసేజ్‌లు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెండు వేల మంది దాకా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈపీఎఫ్ ప్రతి నెలా కట్ అవుతోంది.ఇప్పటికే అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ తిరిగి ఇవ్వాలంటూ 647 మందికి మేసేజ్‌లు రావడంతో అటు పీఎఫ్ కార్యాలయం చుట్టూ(బృందావన్ గార్డెన్స్), ఇటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీఎఫ్ కౌంటర్ వద్ద పడిగాపులు పడుతున్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ లేదా పాస్‌పోర్ట్ తప్పనిసరి నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు చాలా మందికి చదువు అంతంత మాత్రంగానే ఉంటుంది. అయితే, అధికారులు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా పాస్‌పోర్ట్ అడుగుతున్నారు. ఇప్పటికప్పుడు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తేవడానికి కార్మికులు నరకయాతన పడుతున్నారు. పాస్‌పోర్ట్ కోసం వేల రూపాయలను డిమాండ్ చేయడంతో అప్పులు చేసి మరీ తెప్పించుకుంటున్నారు.

**డబ్బులు ముట్టజెప్పితే సరే...**

ఈపీఎఫ్ ఖాతాలో పేర్లు తప్పులు పడటం, భర్త/భార్య/తండ్రి/తల్లి పేర్లలో తప్పులు దొర్లడం..పుట్టిన తేదీలో తప్పులు వంటివి తరుచుగా పారిశుద్ధ్య కార్మికులను వేధించే ప్రధాన సమస్యలు. వీటి పరిష్కారానికి ప్రత్యేక క్యాంపులు పెట్టినప్పటికీ సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదు. కొంత మంది సిబ్బంది కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉండే పీఎఫ్ సిబ్బందికి(కాంట్రాక్ట్ ఏజెన్సీకి) డబ్బులు ముట్టచెప్పి పనిచేయించుకుంటున్నారు. కొంత మంది వారు అడిగింది ఇచ్చుకోలేక, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

## చార్వాక ఆశ్రమంలో ప్రారంభమైన నాస్తిక మేళా



మాట్లాడుతున్న తమిళ సెల్వన్, విజయ్‌కుమార్

**నిడమర్రు (మంగళగిరి) :** మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేసిన మేధావి పెరియార్ రామస్వామి అని పలువురు వక్తలు కొనియాడారు. గుంటూరు జిల్లా నిడమర్రు చార్వాక ఆశ్రమంలో శనివారం 33వ నాస్తికమేళా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న మేళాను సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఫిర సభ్యురాలు మౌనిక ప్రారంభించారు. నాస్తిక సమాజం నాయకులు సీహెచ్ శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిష్యత్తు ఆలోచనాపరుడు పెరియార్ అంశంపై ది రేషనలిస్ట్ ఫోరం తమిళనాడు అధ్యక్షుడు ఆర్.తమిళ సెల్వన్ మాట్లాడుతూ పెరియార్ రామస్వామి సమాజంలో ఉన్న కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు ప్రజలందరికీ నాణ్యమైన విద్య అందించాలని కృషి చేశారన్నారు. సైన్స్ మీదా మాదా అనే అంశంపై రాయపూర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ కె. విజయకుమార్ మాట్లాడుతూ సైన్స్ ఎలా అభివృద్ధి చెందింది. డార్విన్ మహనీయుడు ఏమి చెప్పారు. ఈ రోజులలో సూడో సైన్స్ ఎలా ప్రజల ముందుకు వస్తుంది అనే అంశాలపై వివరించారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల కష్టాలు తీర్చాలి



**తాడేపల్లిరూరల్ :** తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. శనివారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదనం, బి.అంకయ్య, దుర్గా భవాని, సారమ్మ, ఇజ్రాయిల్, గురవయ్య, పిచ్చయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

### తొలిరోజున స్వామివారికి పెళ్లికుమారుడిగా అలంకరణ



స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు

**తెనాలి:** పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమప్తంగా శనివారం ఉదయం విశేష పూజలతో ప్రారంభమయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు ఏడురోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారిని, మంగళ వాయిద్యములు వేదమంత్రాల నడుమ పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పెండ్లి కుమారుడిగా భక్తులచే పూజలు అందుకున్నారు. రాత్రి ఏడు గంటలకు విష్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ పూజా విధులను ఆలయ వంశ పారంపర్య అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో అర్చకులు ఆర్‌వీ కిరణ్, రమేష్ నిర్వహించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో, మహిళా మండలి సభ్యులు శ్రీహనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణను సామూహికంగా చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ సీతా రాముల కళ్యాణం, రాత్రి ఏడు గంటలకు శ్రీ తిరుచ్చి వాహన సేవ పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలిరోజు స్వామిని పెళ్లి కుమారుడిని చేసిన వేడుకలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వర్లు, జంద్యం రామారావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, మూర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ కాసరనేని కళా సమితి నాటకోత్సవాలు ప్రారంభం

**నగరంపాలెం:** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై రెండు రోజులపాటు జరగనున్న డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి 13వ నాటకోత్సవాలు కె.ఆర్.కె.ఈవెంట్స్ నిర్వహణలో శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కళా సమితి చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ కాసరనేని సదాశివ రావు ఆత్మీయ పురస్కారాన్ని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు అందించి, సత్కరించారు.

### ‘డొక్కా’ది గోడ మీద పిల్లి నైజం

**పట్నంబజారు :** గోడ మీద పిల్లిలా మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యవహరించడాన్ని చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు విమర్శించారు. దళిత సామాజికవర్గమంతా డొక్కా వ్యవహారశైలి చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసే అర్హత డొక్కాకు లేదని తెలిపారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా ? అన్న చంద్రబాబు పంచన చేరిన ఆయన వైఎస్. జగన్ గురించి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, లీగల్ విభాగం నేతలు పాల్గొన్నారు.

## హవ్వ.. కూటమి ప్రభుత్వానికి ర్యాంకులా ?

**వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి**

**పట్నంబజారు:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేకపోయినా...వారికి వారే ర్యాంకులు ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అప్పటి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి అమలు చేసిన ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు. అమాయకులను అరెస్ట్ చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నందుకు ప్రథమ స్థానం.. పూర్తిగా క్షీణించిన పర్యటానికి రెండో స్థానం.. ఇంత వరకు ఏ ఒక్క పరిశ్రమ పెట్టని శాఖకు మూడో స్థానంతో పాటు వివిధ శాఖలకు ర్యాంకులు కేటాయించటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఆరు, లోకేష్ ఎనిమిది, పవన్ కల్యాణ్‌కు 10 స్థానాలు కేటాయించుకున్నారంటే.. వారెంత వెనుకబడి ఉన్నారో.. వారే ఒప్పుకుంటున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయనందుకు చంద్రబాబుకు ఆరో ర్యాంకు ఎందుకు వచ్చిందో చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. ఏ మాత్రం సిగ్గు ఉన్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో కచ్చితంగా ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాబోయే రోజుల్లో వైఎస్ జగనన్న- 2 చూడటం తథ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు సర్కార్‌కు సొంత డప్పు కొట్టుకోవటం కొత్తేమి కాదని ఎద్దేవా చేశారు.

### సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన

**గుంటూరు ఎడ్యుకేషన్:** పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. రత్న కుమార్ డిమాండ్ చేశారు. జెడ్పీ ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పందన లేనిపక్షంలో భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు. సీనియార్టీ జాబితాలను అప్‌డేట్ చేయలేదని, యూనిఫాం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఖాళీ అయిన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్. రాజేష్, ప్రభు కుమార్, కో-ఆప్టెడ్ సభ్యుడు ఎస్. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బీఆర్ అంబేడ్కర్, కోశాధికారి షేక్ పెదబాబు, సుభాని పాల్గొన్నారు.

## అనధికార కట్టడాలపై పటిష్ట పర్యవేక్షణ

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

**నెహ్రూనగర్:** నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా అనధికార కట్టడాలు నిర్మాణం జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పటిష్ఠంగా పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం ఆయన రోజువారీ పర్యటనలో భాగంగా వికాస్ నగర్, ఎస్‌వీఎస్ కాలనీ, కొరిటెపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికార కట్టడాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో ప్రతి నిర్మాణం నిబంధనల మేరకే జరగాలని చెప్పారు. నిర్మాణం చేసుకునే వారికి ప్లాన్‌కి దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణం జరిగిన ప్రతి భవనానికి ఆస్తి పన్ను విధించేలా అడ్మిన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. బహుళ అంతస్తు భవనాలకు ఓసీ వచ్చే వరకు వేచి ఉండకుండా నివాసం ఉండే ప్లాట్‌లకు పన్ను విధించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో అండర్ అసెస్‌మెంట్లు, అన్ అసెస్‌మెంట్లు గుర్తిస్తే సంబంధిత అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఈ రమేష్ బాబు, ఆర్వో మదన్ గోపాల్, ఏసీపీ రెహ్మాన్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడా పోటీల్లో బహుమతులు అందుకున్న ఎన్నారై కళాశాల విద్యార్థినులు

**మేడికొండూరు :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, మంచి ఆరోగ్యం, దీర్ఘకాలిక రోగాలనే దూరం చేస్తాయని ఎన్నారై కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాసరావు అన్నారు. మేడికొండూరు పరిధిలోని ఎన్నారై ఐటీఐ కళాశాలలో రెండు రోజులుగా నెహ్రూ యువ కేంద్రం, కళాశాలల సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ 100 మీటర్లు, షాట్‌పుట్ ఈవెంట్లు నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. శారీరకంగా, మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. గెలుపు ఓటములు సాధారణమని, ఓటమి, గెలుపుకు నాంది అని తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రంను అభినందించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, ప్రొఫెసర్ రాము, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ రెహమాన్, డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ కోటేశ్వరావు, రవికుమార్, ప్రొఫెసర్ సౌజన్య, ఎన్నారై కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరుణ, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, కొమ్ము రాజు, పలు ప్రాంతాల నుంచి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

**ఫిరంగిపురం:** తల్లిపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గొల్లపాలెం సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. టీకాల అమలును పరిశీలించారు. ఐఎల్‌ఆర్(వ్యాక్సిన్ భద్రపరచ్చు గది)ని పరిశీలించారు. గర్భిణులు, ఏడాదిలోపు చిన్నారులు, రెండు నుంచి ఐదేళ్ల లోపు వారికిచ్చే వ్యాక్సిన్ వివరాలు యూవీ పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బంది చెప్పారు. వచ్చే ఏడాదికి వ్యాక్సిన్లు తమ పరిధిలో ఎంత అవసరమో ముందుగా ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి మైక్రో వ్యాక్సిన్ ప్లాన్ వేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారిలో నాన్ కమ్యూనబుల్ డిసీజ్‌ను ముందుగా గుర్తించాలన్నారు. ఆర్సీహెచ్ పోర్టల్ రిజిస్టర్, వ్యాక్సిన్ క్యారియర్, ఐస్ పోల్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం వీఎస్ఆర్ శాస్త్రి, డాక్టర్ ఫరీనాబేగం, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు కె.సుదర్శన్‌రాజు, షేక్, అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## ఏటీఎంలకు భద్రత కరువు



సొలస బస్టాండు సెంటర్‌లో సెక్యూరిటీ గార్డులేని ఎస్‌బీఐ ఏటీఎం



113 తాళ్లూరు రోడ్డులో ఏటీఎం గది



బస్టాండు సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు ఏటీఎం

**ఫిరంగిపురం:** మండల కేంద్రంలోని పలు బ్యాంకుల ఏటీఎంల వద్ద పూర్తిగా భద్రత కొరవడింది. ఏటీఎంల వద్ద సంబంధిత బ్యాంకులు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం లేదు. మండల కేంద్రంలోని బస్టాండు సెంటర్‌లో ఉన్న యూనియన్ బ్యాంకు, సొలస బస్టాండు సెంటర్‌లోని ఎస్‌బీఐ, 113 తాళ్లూరు వెళ్లే రోడ్డులోని ఇండియా బ్యాంకు ఏటీఎంలు ఉన్నాయి. ఇటీవల నగదు డ్రా చేసేందుకు ఏటీఎంకు వచ్చిన ఓ అమాయకుడి కార్డు మార్చి మరోచోట నగదు డ్రా చేసిన ఘటన జరిగింది. సంబంధిత ప్రాంతంలో సీసీ కెమారాలున్నా.. పూర్తి స్థాయిలో రికార్డైన చిత్రాల్లో వ్యక్తులు కన్పించని పరిస్థితి. బ్యాంకుల అధికారులు స్పందించి ఏటీఎంల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు, ప్రజలు కోరుతున్నారు.

## జ్ఞాన సాయిబాబా మందిర వార్షికోత్సవం



కోలాటం చేస్తున్న మహిళలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

**పెదవడ్లపూడి(మంగళగిరి):** నగర పరిధిలోని పెదవడ్లపూడి చైతన్య నగర్, రేవేంద్రపాడు సెంటర్‌లోని జ్ఞాన సాయిబాబా మందిరం 10వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 9 వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. బాబాకు తెల్లవారుజామున కాగడ హారతి పూజలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, అభిషేకం, వస్త్రాలంకరణ, శిఖర కలశ కుంభాభిషేకం, కృష్ణుడు, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సుమారు పది వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### కుష్ఠు వ్యాధిపై అవగాహన



**తెనాలిటౌన్:** కుష్ఠు వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని లెప్రో సొసైటీ ప్రతినిధి ఎ.వహిద్ బాషా పేర్కొన్నారు. లెప్రో సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా ఫార్మసీ కళాశాలలో శనివారం కుష్ఠు వ్యాధి - చికిత్స అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా తెనాలి పరిసర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఏర్పడితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో మందులు వాడుకుంటే చాలా వరకు కుష్ఠు తగ్గే అవకాశం ఉందన్నారు. డబల్ హార్స్ ఫౌండేషన్ సహకారంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**•విధుల్లో రాణించాలి**

**నగరంపాలెం:** జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఉమేష్ చంద్ర హాల్‌లో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (హెచ్‌ఆర్‌డీ సెంటర్)లో శిక్షణ పూర్తయిన తొలి బ్యాచ్ కానిస్టేబుళ్లకు ధ్రువీకరణ పత్రాలను శనివారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. ఇటీవలే హెచ్‌ఆర్‌డీ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.